సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 20 । జూలై । 2023



వీడని వాన

జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మన్యంలోని జలాశయాలు, చెరువుల్లో భారీగా వరదనీరు చేరింది. నిండుకుండల్లా మారాయి. 8లో ▸



పాస్టర్ ఆత్మహత్య !

కుటుంబ కలహాల నేపథ్యంలో ఏలూరు నగరంలో ఒక పాస్టర్ ఉరివేసుకుని మృతి చెందాడు. సత్రంపాడుకు చెందిన పిల్లి పవన్ కుమార్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 8లో ▸



దంపతుల ఆత్మహత్య

మొగల్తూరుకు చెందిన ముద్రగళ్ల వెంకట కృష్ణప్రసాద్, అతని భార్య రాజరాజేశ్వరిలు విశాఖపట్నంలో పీఎం పాలెంలో ఆత్మహత్యకు పాల్పడ్డారు. 8లో ▸

డిజిటల్ చెల్లింపులదే హవా

- ఆన్‌లైన్ చెల్లింపులకు చిరు వ్యాపారులూ మొగ్గు
- నగదు లావాదేవీలకు క్రమంగా స్వస్తి

సాక్షి, భీమవరం: నిన్న మొన్నటి వరకూ పెద్ద షాపింగ్ మాల్స్, వ్యాపార సంస్థలకే పరిమితమైన డిజిటల్ పేమెంట్లు నేడు చిన్న వ్యాపారుల, తోపుడు బండ్ల వ్యాపారుల చెంతకు సైతం చేరాయి. నగదు లావాదేవీలు తగ్గుతుండగా ఎక్కడ చూసినా ఆన్‌లైన్ చెల్లింపులే దర్శనమిస్తున్నాయి. కేంద్రప్రభుత్వం పెద్ద నోట్ల రద్దు తర్వాత డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించేందుకు ప్రయత్నించినా అప్పట్లో పెద్దగా ప్రజలు ఆసక్తి చూపించలేదు. షాపింగ్ మాల్స్, పెద్ద వ్యాపార సంస్థల్లో మాత్రమే పేమెంట్ యాప్‌లు, క్రెడిట్, డెబిట్ కార్డులతో చెల్లింపులు జరిగేవి. అప్పట్లో ఆన్‌లైన్ పేమెంట్ల వల్ల తమ ఖాతాలోని నగదు వేరే వారి ఖాతాల్లోకి వెళ్లిపోతుందన్న అపోహలు, ఆర్థిక మోసాలు జరుగుతాయన్న భయంతో చిన్నపట్టణాలు, గ్రామాల్లో ఆన్‌లైన్ చెల్లింపుల జాడ పెద్దగా కనిపించేది కాదు. కోవిడ్ కారణంగా నగదు రహిత లావాదేవీల్లో గణనీయమైన మార్పులు ప్రారంభమయ్యాయి. ఇంట్లోంచి బయటకు రాకుండా కావల్సిన వస్తువులను ఆన్‌లైన్‌లో బుక్‌చేసుకోవడమేగాక చెల్లింపులు కూడా ఆన్‌లైన్‌లోనే చేయడం పెరిగింది. ఇక కిరాణా, ఫ్యాన్సీ, మందులు, పెట్రోల్ బంకులు, ఇతర నిత్యావసర వస్తువుల దుకాణాలతో పాటు మొబైల్, డీటీహెచ్ రీచార్జీలు, విద్యుత్, గ్యాస్ బిల్లులు, ఇతర ఆర్థిక లావాదేవీలు చాలావరకూ యాప్ ద్వారానే సాగిపోతున్నాయి. బజ్జీల బండి, బటర్ మిల్క్ బండి, వల్కనైజింగ్ సెంటర్ల వద్ద క్యూఆర్ కోడ్ స్టిక్కర్ల హవా సాగుతోంది. పేమెంట్ యాప్‌ల వినియోగంలో వృద్ధులు సైతం ముందు వరుసలో ఉంటున్నారని వ్యాపారులు చెబుతున్నారు.



భీమవరంలోని ఎలక్ట్రికల్ షాపు వద్ద క్యూఆర్ కోడ్ స్కానింగ్ చేస్తున్న దృశ్యం

జిల్లాలో 351 బ్యాంకుల్లో సేవలు

జిల్లాలో ప్రభుత్వరంగ బ్యాంకులు 237, ప్రైవేట్ బ్యాంక్‌లు 79, జిల్లా కో–ఆపరేటివ్ బ్యాంక్‌లు 15, చైతన్య గ్రామీణ బ్యాంక్‌లు 20 ఉన్నాయి. వాటి ద్వారా ఖాతాదారులకు డిజిటల్ బ్యాంక్ సదుపాయాలు కలుగచేస్తుండగా ప్రతి బ్యాంక్ సొంత డిజిటల్ బ్యాంక్ యాప్ ద్వారా ఖాతాదారులకు అవగాహన కల్పిస్తుంది. అన్ని రకాల వ్యాపారులకు యూపీఐ ఐడీ, క్యూర్ కోడ్ అందించడంతో దాదాపు 80 శాతం మంది డిజిటల్ బ్యాంక్ సేవలు వినియోగించుకుంటున్నారు. భీమవరం రీజియన్ పరిధిలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు 73 బ్రాంచ్‌లుండగా ప్రతిరోజు సుమారు 1.35 లక్షల మంది డిజిటల్ బ్యాంకింగ్ సదుపాయాన్ని వినియోగించుకుంటున్నారు. ఆన్‌లైన్ చెల్లింపులతో ప్రధానంగా చిల్లర సమస్య తప్పింది. టీ స్టాళ్లు, హోటళ్లు, తోపుడు బండ్లు, సైకిళ్లపై రోడ్ల పక్కన, ఇంటింటికీ తిరుగుతూ కూరగాయలు, పండ్లు అమ్మే వ్యాపారులకు గతంలో చిల్లర సమస్య ఉండేది. కొన్నిసార్లు చిల్లర లేక బేరాలు సైతం వదులుకోవాల్సివచ్చేది. ప్రస్తుతం ఆన్‌లైన్ చెల్లింపుల వల్ల చిల్లర సమస్య లేకపోవడంతో చిరు వ్యాపారులు సైతం వీటి వైపు మక్కువ చూపుతున్నారు. పేమెంట్ యాప్‌లకు సంబంధించిన క్యూఆర్ కోడ్ ఆయా సంస్థల ఏజెంట్లు వెనువెంటనే అందజేస్తుండడంతో ఏ దుకాణం వద్ద చూసిన క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు దర్శనమిస్తున్నాయి.

స్పీకర్ బాక్స్‌లతో మోసాలకు చెక్

ఆన్‌లైన్ చెల్లింపుల్లో మోసాలకు చెక్ పెట్టేలా స్పీకర్ బ్యాక్స్‌లు ఏర్పాటుచేస్తున్నారు. ఆన్‌లైన్ చెల్లింపు జరగగానే ఎంత అమౌంట్ జమ అయ్యిందనే విషయం స్పీకర్‌లో ఆడియో మెసేజ్ వస్తుంది.

పర్సులో సొమ్ములు లేకున్నా షాపింగ్



గతంలో చేతిలో పర్సు అందులో సొమ్ములు పెట్టుకుని బజారుకు వెళ్లాల్సి వచ్చేది. నేడు డిజిటల్ పేమెంట్ల వల్ల పర్సు లేకున్నా ఫోన్ పే, లేదా క్యూఆర్ కోడ్ స్టిక్కర్లను వినియోగించుకుని సెల్ ఫోన్ ద్వారా చెల్లింపులు చేస్తున్నాం

– సీహెచ్‌ఎస్ చంద్రిక, భీమవరం

కో ఆపరేటివ్ బ్యాంకుల్లోను...



కోఆపరేటివ్ బ్యాంకుల్లోను డిజిటల్ బ్యాంకింగ్ వినియోగం అమలులో ఉంది. ఏటీఎం కార్డులు, యాప్‌లను ఉపయోగించి అనేక మంది ఖాతాదారులు సేవలు పొందుతున్నారు. దీంతో బ్యాంకుల్లో ఉద్యోగులకు ఒత్తిడి తగ్గుతోంది.

– టీవీ రెడ్డినాయుడు, భీమవరం బ్రాంచ్ మేనేజర్

పెరిగిన డిజిటల్ బ్యాంకింగ్ సేవలు



ప్రస్తుతం చిరువ్యాపారుల వద్ద కూడా డిజిటల్ బ్యాంకింగ్ సేవలు పెరిగాయి. ఎక్కువ మంది ఫోన్‌పే లేదా క్యూఆర్ కోడ్ స్టిక్కర్లను ఉపయోగించి చెల్లింపులు చేస్తున్నారు. దీంతో చిల్లర సమస్య తీరడంతోపాటు సమయం కూడా కలిసివస్తోంది.

– సీహెచ్ రామకృష్ణ, వ్యాపారి, భీమవరం

హెల్మెట్ భారం కాదు.. బాధ్యత

ఎస్పీ రవిప్రకాష్



ఉండిలో హెల్మెట్ డ్రైవ్ పరిశీలిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

ఉండి: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను భారంగా కాకుండా బాధ్యతగా భావించాలని జిల్లా ఎస్పీ రవిప్రకాష్ అన్నారు. ఉండి పోలీసులు బుధవారం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఉండి సెంటర్‌లో నిర్వహించిన హెల్మెట్ డ్రైవ్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వాహనదారులకు హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. చాలా కాలం నుంచి వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నామని హెల్మెట్ లేని వారు తప్పకుండా కొని ధరించాలని అన్నారు. హెల్మెట్ లేకుండా మరోసారి పట్టుబడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్డు ప్రమాదాల తీవ్రతను చూస్తుంటే హెల్మెట్. ధరించడం వాహనదారులకు తప్పనిసరి అని అన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాపాయం ఉండదన్నారు. చాలా వరకు హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. కార్యక్రమంలో సీఐలు గీతాకృష్ణ, ఉండి, పాలకోడేరు, కాళ్ల ఎస్సైలు కే గంగాధరరావు, నాళం శ్రీనివాస్, ఏవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

దిశ డీఎస్పీగా మురళీకృష్ణ



నున్న మురళీకృష్ణ, దిశ పోలీస్‌స్టేషన్ డీఎస్పీ

ఏలూరు టౌన్: పశ్చిమగోదావరి జిల్లా భీమవరం దిశ పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా నున్న మురళీకృష్ణను నియమించారు. ఏలూరు జిల్లా దిశ పోలీస్‌స్టేషన్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండు జిల్లాల్లోని దిశ పోలీస్‌స్టేషన్లకు మురళీకృష్ణ డీఎస్పీగా వ్యవహరిస్తారు. 1991 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన మురళీకృష్ణ విజయవాడ, గోపాలపురం, తాళ్ళపూడి, తణుకు టౌన్, తణుకు రూరల్ ఎస్ఐగా పని చేస్తూ మంచి పేరు తెచ్చుకున్నారు. ఆయన 2006లో సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా పదోన్నతి పొందారు. 2014లో సబ్ డివిజినల్ పోలీస్ అధికారిగా పదోన్నతి లభించింది. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, విశాఖపట్నం ఏపీఎస్‌పీ విభాగాల్లో పని చేశారు. ప్రస్తుతం అనంతపురం ఏపీఎస్‌పీకి బదిలీపై వెళ్ళగా తాజా బదిలీల్లో ఆయన పూర్వ ఉమ్మడి పశ్చిమకు దిశ పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా బదిలీ అయ్యారు.

త్రోబాల్ జట్టులో భాస్కరరావుపేట విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కైకలూరు: త్రోబాల్ నేషనల్ అండర్–14 విభాగంలో ఈ నెల 16న విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జట్ల ఎంపిక జరిగింది. ఇందులో కలిదిండి మండలం, భాస్కరరావుపేట జడ్పీహెచ్‌ఎస్ నుంచి ఆరుగురు విద్యార్థులు జట్టుకు ఎంపికయ్యారు. విద్యార్థులు సీహెచ్ చరణ్ తేజ, డి.బాల నాగ సంతోష్, కె.రాము, పి.వినయ్ బాబు, ఎం. శ్యాం కుమార్, కె.సూర్య గణపతి, శిక్షణ అందించిన పీడీ జి.రవిబాబులను అభినందించారు.

అధిక వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

బుట్టాయగూడెం: కొద్దిరోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సూచించారు. బుధవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఎగువన కురుస్తున్న వర్షాల వల్ల గోదావరి వరద పెరిగే అవకాశం కనిపిస్తుందని అన్నారు. బుధవారం అర్ధరాత్రి సమయానికి భద్రాచలం వద్ద 40 అడుగులు ఎత్తులో గోదావరి ప్రవహించే అవకాశం ఉందని అధికారులు చెప్పారని అన్నారు. ఈ పరిస్థితుల్లో లోతట్టు ప్రాంతంలో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా అధికారులను అప్రమత్తం చేశారని అన్నారు. ఇప్పటికే ఐటీడీఏ, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌డీఓ, ఎంపీడీఓలు, అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అవసరమైన సహాయక చర్యలు చేపట్టేలా ఆదేశాలు ఇచ్చామని చెప్పారు.

రైతులు సాంకేతిక పద్ధతులు అవలంబించాలి



అప్పనపేటలో పొలంబడిలో పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

గణపవరం: రైతులు సాంకేతిక పరిజ్ఞానం అవర్చుకుని, వ్యవసాయ నిపుణుల సలహాలు పాటిస్తూ తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించాలని జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వరరావు రైతులకు సూచించారు. బుధవారం గణపవరం మండలం అప్పనపేటలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు అనవసర వ్యయం తగ్గించుకుని అధిక లాభం పొందాలన్నారు. ఎరువులు, పురుగుమందుల వినియోగం అవసరం మేరకు ఉండాలని, అతిగా వాడటం వల్ల తెగుళ్ల అదుపులోకి రావన్నారు. పైగా ఆహార ధాన్యాలలో పురుగుమందుల అవశేషాలు ఉంటాయన్నారు. నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు మోతాదుకు మించి వాడరాదన్నారు. తాడేపల్లిగూడెం డివిజన్ వ్యవసాయ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానం పరిచయమవుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నక్కా సూరి బంగారయ్య, ఎంపీటీసీ కొల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కులాల మధ్య చిచ్చుపెట్టే నేత పితాని



విలేకర్లతో మాట్లాడుతున్న ఎస్సీ సంఘాల నేతలు

పెనుగొండ: నియోజకవర్గంలో కులాల మధ్య చిచ్చు పెట్టి లబ్ధి పొందే నాయకుడు మాజీ మంత్రి పితాని అని, కులాలను రెచ్చగొట్టే వ్యక్తిత్వం మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు లేదని ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు, ఎంపీటీసీ చిన్నం ఏడుకొండలు విమర్శించారు. బుధవారం సిద్ధాంతంలో విలేకర్లతో మాట్లాడుతూ నడిపూడి శివారు మిద్దేవారిపాలెంలో 12 కుటుంబాలను వెలివేస్తే అరాచకాలు భరించలేక బాధితులు పోలీసులను ఆశ్రయిస్తే మాజీ మంత్రి పితాని వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. వెలి సంఘటనను పోలీసులు నిర్ధారణ చేస్తే, వారిపై కేసు నమోదు చేయవద్దంటూ ఒత్తిడి తీసుకురావడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. గతంలోనూ ఇదే విధంగా సిద్ధాంతంలోనూ వ్యవహరించారన్నారు. బీసీలకు, ఎస్సీలకు మధ్య చిచ్చు పెట్టారన్నారు. స్థానికంగా ఇరువర్గాలు రాజీ పడితే, ఎస్పీ వద్దకు వెళ్లి రాజీ కుదరదని కేసు కావాలని చెప్పిన నాయకుడు మాజీ మంత్రి పితాని అని ఎద్దేవా చేశారు. 15 ఏళ్లుగా కుల రాజకీయాలు చేసి ప్రజలను విడదీయడం వల్లే గత ఎన్నికల్లో పరాజయం పాలయ్యారన్నారు. అన్ని వర్గాలను సమానంగా చూసుకుంటూ అభివృద్ధికి పట్టం కడుతున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు వెంటే నియోజకవర్గ ప్రజలు ఉన్నారన్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు ఆచంట నుంచి విజయకేతనం ఎగురవేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరరావు, మండల ఎస్సీ సెల్ కన్వీనరు పలివెల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా తనిఖీ పకడ్బందీగా చేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ఓటరు జాబితా వ్యూరిఫికేషన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి బూత్ లెవల్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో కలెక్టర్ తాడేపల్లిగూడెం, ఉండి, పాలకొల్లు నియోజకవర్గాల ఎలక్షన్ డీటీలు, బీఎల్వోలు, వీఆర్వోలతో సమావేశమై పోలింగ్ స్టేషన్ల వారీగా ఓటర్ల జాబితాలపై సమీక్షించి పలు సూచనలు ఇచ్చారు. జూలై 21 నుంచి బూత్‌లెవెల్ అధికారులు ఇంటింటికి వెళ్లి ఓటర్ల లిస్ట్ స్వచ్ఛీకరణ చేసే కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు ప్రతిపాదించిన బీఎల్ఏలు వస్తే అనుమతించాలన్నారు. సర్వేకి వెళ్ళినప్పుడు 18 ఏళ్లు నిండిన వారు ఆ ఇంట్లో ఉంటే వారిని ఓటరుగా నమోదు చేయాలని, ఓటు ఉన్న వ్యక్తి మరణిస్తే వారి ఓటును లిస్ట్ నుండి తొలగించాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. ఓటు నమోదులో పేర్లు, చిరునామా తప్పులు లేకుండా ఒకటికి రెండుసార్లు సరి చూసుకోవాలన్నారు. ఒకే ఇంటిలో పదిమంది ఓటర్లు ఉంటే అలాంటి ఇళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు, వాస్తవానికి సంబంధిత ఓటర్లు ఆ ఇంట్లో లేకపోతే ఫారం 8 ద్వారా తొలగించాలని, ఒకవేళ వారు వేరే ఇంటికి మారితే ఫారం 7 ద్వారా వారి చిరునామా మార్పు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జాబితాను పక్కాగా రూపొందించేందుకు సమష్టిగా పని చేయాలన్నారు.

నాడు–నేడు త్వరితగతిన పూర్తిచేయాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

సాక్షి, భీమవరం: మనబడి నాడు–నేడు మిగిలిన పనులు వారం రోజుల్లో 90 శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి మనబడి నాడు–నేడు పనులు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలు, మధ్యలో బడిమానేసిన పిల్లలు మళ్లీ బడిలో చేర్పించే తదితర అంశాలపై ప్రత్యేక అధికారులు, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమై 45 రోజులు అవుతుందని, మిగిలిన పనులు వారం రోజుల్లో 90 శాతం పూర్తి చేయాలని ఆమె అన్నారు. స్కూలుకు వచ్చిన మెటీరియల్, పూర్తయిన ప్రతి పనిని రిజిస్టర్లలో నమోదు చేయాలని, రిజిస్టర్లు మెయింటైన్ చేయని పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల అధికారులు క్రమం తప్పకుండా రోజుకు రెండు పాఠశాలలు చొప్పున తనిఖీ చేసి పూర్తి నివేదికలు జిల్లా కార్యాలయానికి పంపాలని అన్నారు. కమిటీలు, ప్రధానోపాధ్యాయులు పనులు నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

బడిమానేసిన పిల్లల్ని మళ్లీ చేర్పించిన వివరాలు మండలాలు, పురపాలక సంఘాలు వారీగా సమీక్షించారు. పిల్లల ఇంటికి నేరుగా వెళ్లి ఆయా తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించి తిరిగి పాఠశాలల్లో చేర్చేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల డేటా తీసుకుని చర్యలు వేగవంతం చేయాలన్నారు. తిరిగి బడిలో చేర్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యాశాఖ అధికారి ఆర్.వెంకట రమణ, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసరావు, ఐసీడీఎస్ అధికారి ఎం.సుజాతా రాణి, భీమవరం పురపాలక సంఘం ఇన్‌చార్జ్ కమిషనరు సుధాకర్ పాల్గొన్నారు.

దేవస్థానం క్యాంటీన్ నిర్వహణకు బహిరంగ వేలం

శ్రీవారికి ఏడాదికి 19.20 లక్షల ఆదాయం



శ్రీవారి కొండపైన పద్మావతి క్యాంటీన్

ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపైన దేవస్థానం నిర్వహిస్తున్న పద్మావతి క్యాంటీన్‌ను రెండేళ్ల కాలపరిమితికి లీజుకిచ్చేందుకు దేవస్థానం అధికారులు బుధవారం బహిరంగ వేలాన్ని నిర్వహించారు. అందులో వచ్చిన హెచ్చుపాటను అధికారులు ఆమోదించారు. వివరాల్లోకి వెళితే.. కొండపైన పద్మావతి హోటల్ భవనం నిర్మించినప్పటి నుంచి నిరుపయోగంగా ఉంది. అనివేటి మండప విస్తరణ పనుల్లో భాగంగా జంటగోపురాల సమీపంలో ఉన్న తాత్కాలిక క్యాంటీన్ భవనాన్ని తొలగించడంతో, నిరుపయోగంగా ఉన్న పద్మావతి క్యాంటిన్ భవనాన్ని వాడుకలోకి తేవాలని అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలోనే ఈ ఏడాది మే 31న బహిరంగ వేలాన్ని నిర్వహించగా, అందులో పాటదారులెవరూ పాల్గొనలేదు. దాంతో జూన్ 1 నుంచి క్యాంటిన్ నిర్వహణను దేవస్థానమే స్వయంగా చేపట్టింది. గతనెల 26న మరోసారి బహిరంగ వేలాన్ని నిర్వహించగా మండలంలోని రాళ్లకుంటకు చెందిన వాసిరెడ్డి చంద్రశేఖర్ నెలకు రూ.1.47 లక్షలకు పాడి హెచ్చుపాటదారుడిగా నిలిచారు. ఇంకా మంచి ఆదాయం వస్తుందని భావించిన దేవస్థానం అధికారులు పాటను ఈనెల 19 కి వాయిదా వేశారు. క్యాంటీన్ నిర్వహణ వల్ల దేవస్థానానికి నెలకు సుమారు రూ. 2 లక్షల నష్టంతో పాటు, లీజుకిస్తే వచ్చే అద్దెను కోల్పోయింది. ఈ నేపథ్యంలో బుధవారం జరిగిన బహిరంగ వేలంలో ముగ్గురు పాటదారులు పాల్గొనగా, గత నెలలో పాటను దక్కించుకున్న చంద్రశేఖర్ నెలకు రూ. 1.60 లక్షలకు పాటపాడి మళ్లీ హెచ్చు పాటదారుడిగా నిలిచారు. దీన్ని దేవస్థానం అధికారులు ఆయనకు ఇచ్చేందుకు ఖరారు చేశారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్

సాక్షి, భీమవరం: పశ్చిమగోదావరి జిల్లాలోని ఐటీ కోర్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ సీహెచ్ మోహనరావును సస్పెండ్ చేసినట్లు ఎస్పీ యు.రవిప్రకాష్ చెప్పారు. ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసినట్లు స్పందనలో వచ్చిన ఫిర్యాదుపై విచారణ అనంతరం సస్పెండ్ చేశామన్నారు.

చిరు వ్యాపారులకు అండదండలు

- అప్పు ఇవ్వడమే కాదు వడ్డీ మాఫీ
- ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న చిరు వ్యాపారులు



ఆకివీడులో తోపుడు బండిపై బొప్పాయి పండ్లు అమ్ముకుంటున్న చిరు వ్యాపారి

ఆకివీడు: చిరు వ్యాపారులకు జగనన్న తోడు పథకం అండగా ఉండటంతో వారి ఆర్థిక పరిస్థితి మెరుగవుతోంది. ఒకప్పుడు అధిక వడ్డీలకు అప్పులు తీసుకొచ్చి, సాయంత్రానికి లాభాల్ని వడ్డీ రూపంలో వారి చేతుల్లో పెట్టి ఉసూరుమంటూ ఇంటికి వెళ్తేవారు. స్వాతంత్ర్యం వచ్చాక ఏ ప్రభుత్వం కూడా చిరు వ్యాపారుల్ని ఆదుకున్న దాఖలాలు లేవు. వారికి ఆర్థిక సహాయం అందజేసిన ఆనవాళ్ళే లేవు. పాదయాత్రలో వారి ఇబ్బందుల్ని స్వయంగా చూసిన జగనన్న చలించి జగనన్న తోడు పథకం ప్రవేశపెట్టారు. టీ స్టాల్ దగ్గర నుంచి పండ్ల వర్తకులు, చిరుతిళ్ల వ్యాపారులు, మోటారు సైకిళ్లపై కూరగాయలు, దుస్తులు, ఇతర సామగ్రి విక్రయించే చిరు వ్యాపారులకు జిల్లావ్యాప్తంగా గత ఆరు విడతలలో 68,210 మందికి రూ. 10 వేల చొప్పున రూ.68.21 కోట్లు అందజేశారు. చిరు వ్యాపారులకు ఏడాదిలో రెండు పర్యాయాలు లబ్ధి చేకూరేలా రుణ సదుపాయం కల్పిస్తున్నారు. ఆరవ విడత రుణం పొందిన 22,604 మందికి వడ్డీ రాయితీ సొమ్ము రూ.51,46,271 వారి ఖాతాల్లో సీఎం జగన్ మోహన్ రెడ్డి బటన్ నొక్కి జమ చేశారు.

పంచాయతీలకు ఆదాయం

పల్లెల్లో చిరు వ్యాపారాలు జోరందుకున్నాయి. గతంలో వ్యాపారం లేక ఇబ్బంది పడే పరిస్థితి ఉండేది. నేడు ప్రజల ఆర్థిక స్థితి పెరగడంతో చిరు వ్యాపారాలకూ డిమాండ్ పెరిగింది. కాఫీ హోటళ్లు, బడ్డీ కొట్లు, బజ్జీల బళ్లు, టిఫిన్ సెంటర్లు పెరిగాయి. పంచాయతీల్లో, పట్టణాల్లోనూ తోపుడు బళ్ల ద్వారా విక్రయించే యజమానులు పంచాయతీలకు పన్ను చెల్లిస్తున్నారు. ఆశీలు ద్వారా పంచాయతీలకు ఆదాయం పెరుగుతోంది.

నియోజకవర్గాల్లో జగనన్న తోడు లబ్ధిదారులు

నియోజకవర్గం	లబ్ధిదారులు	మొత్తం (రూ.కోట్లలో)
ఉండి	12,816	12.81
ఆచంట	10,656	10.66
భీమవరం	8,366	8.36
నర్సాపురం	7,275	7.27
పాలకొల్లు	11,945	11.94
తాడేపల్లిగూడెం	7,287	7.28
తణుకు	9,865	9.86
మొత్తం	68,210	68.21

ఏటా పెరుగుతున్న లబ్ధిదారులు



జగనన్న తోడు పథకం లబ్ధిదారుల సంఖ్య ప్రతీ ఏటా పెరుగుతోంది. గతంలో తీసుకున్న లబ్ధిదారులు సకాలంలో సొమ్ము చెల్లిస్తే, మళ్లీ రుణం ఇస్తున్నాము. ఆ విధంగా రుణం చెల్లించిన లబ్ధిదారులకు వడ్డీ రీయంబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం రూ. 51,46,271లు వారి ఖాతాల్లో జమ చేసింది. ఈ ఏడాది 18,779 మందికి రూ. 20.22 కోట్ల మేర రుణాలు ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నాము.

– ఎంఎస్ఎస్ వేణుగోపాల్, పీడీ, డీఆర్‌డీఏ, పశ్చిమగోదావరి జిల్లా

వీడని వాన

- మూడు రోజులుగా ముసురు
- స్తంభించిన జనజీవనం
- మన్యంలోని జలాశయాల్లోకి భారీగా చేరిన వరదనీరు


పొంగి పొర్లుతున్న పోగొండ రిజర్వాయర్

బుట్టాయగూడెం: జిల్లాలో గత రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో మన్యం ప్రాంతంలోని జలాశయాలు, చెరువుల్లోకీ భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. వీడని వానతో జనజీవనం స్తంభించి ఇళ్లకే ప్రజలు పరిమితమయ్యారు. వర్షాలకు పోగొండ రిజర్వాయర్, జల్లేరు జలాశయం, కొవ్వాడ రిజర్వాయర్‌లోకి వరదనీరు వచ్చి చేరింది. గుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయం పూర్తి నీటి సామర్థ్యం 217.80 మీటర్లు కాగా ప్రస్తుతం వరదనీరు 217 మీటర్ల సామర్థ్యానికి వచ్చి చేరినట్టు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. పోగొండ రిజర్వాయర్ పూర్తి నీటి సామర్థ్యం 157 మీటర్లు కాగా కొండలపై కురిసిన వర్షంతో రిజర్వాయర్‌లోకి భారీగా వరదనీరు రావడంతో సామర్థ్యానికి మించి నీరు ప్రవహిస్తోంది. దీంతో బైనేరువాగు పొంగి పొర్లుతోంది. అలాగే నందాపురం బైనేరు వాగుపై కట్టిన కల్వర్టుపై నుంచి వరదనీరు పొంగి ప్రవహిస్తోంది. గిరిజన ప్రాంతంలోని చెరువుల్లో కూడా వరదనీరు భారీగా వచ్చి చేరింది.

గూడెంలో భారీ వర్షం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణంలో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. ప్రతి ఐదు నిమిషాలకు ఒక మోస్తారు నుంచి భారీ వర్షం పడింది. పట్టణంలోని ప్రధాన రోడ్లుపైకి వర్షపు నీరు చేరింది. ఇప్పటికే ఉన్న గోతులకు తోడు వర్షపు నీటికి గోతులు మరింత పెద్దవిగా మారాయి. టీటీడీ కల్యాణ మండపం రోడ్డుపై ఉన్న గోతుల్లో నీరు చేరి, రహదారి అధ్వానంగా తయారైంది. ఇదిలా ఉంటే, వర్షానికి ప్రధాన డ్రెయిన్లు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కాగా, గడిచిన 24 గంటల్లో తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో 16.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. పెంటపాడు మండలంలో 5.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ వై.దుర్గాకిషోర్ తెలిపారు.


బుట్టాయగూడెం మండలం నందాపురం సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న బైనేరువాగు


బుట్టాయగూడెం మండలం బైనేరువాగు కల్వర్టుపై నుంచి ప్రవహిస్తున్న వర్షపునీరు

క్లుప్తంగా

'యూనివర్సిటీ'ని విజయవంతం చేయండి


మహిళా కళాశాలలో మాట్లాడుతున్న సినీ దర్శక, నిర్మాత నారాయణమూర్తి

తణుకు టౌన్ : తన దర్శక నిర్మాణ సారథ్యంలో విడుదల కాబోతున్న యూనివర్సిటీ సినిమాను ఆదరించాలని ప్రముఖ సినీ రచయిత, దర్శక నిర్మాత ఆర్ నారాయణమూర్తి కోరారు. బుధవారం ఆయన తణుకులోని ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో విద్యార్థులతో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. యూనివర్సిటీ సినిమా ద్వారా విద్యార్థినీ విద్యార్థులకు నేటి విద్యా వ్యవస్థలో వస్తోన్న వైపరీత్యాలు, కార్పొరేట్ కళాశాలల దౌర్జన్యాలు అర్థమవుతాయని వివరించారు. యూనివర్సిటీని విజయవంతం చేయాలని కోరారు. కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

పురుగు మందుల షాపుల్లో తనిఖీ


నవాబుపాలెం షాపులో తనిఖీ చేస్తున్న ఏఓ

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెం గ్రామంలోని పురుగు మందుల షాపుల్లో మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్ ప్రసాద్ బుధవారం తనిఖీలు నిర్వహించారు. పురుగు మందుల నమూనాలు సేకరించి, రీజనల్ కోడింగ్ సెంటర్‌కు పంపినట్టు ఆయన తెలిపారు. అనుమతి ఉన్న పురుగు మందులనే విక్రయించాలని, ఖచ్చితంగా రికార్డులు నిర్వహించాలని ఆదేశించారు. నిల్వ వివరాలతో కూడిన పట్టికను షాపుల వద్ద ప్రదర్శించాలన్నారు. కాగా, పీఎం కిసాన్ ఈకేవైసీ ప్రక్రియ 95 శాతం పూర్తయిందని, మిగిలిన రైతులు ఈ నెల 28వ తేదీ లోపు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. అర్హత ఉండి పీఎం కిసాన్, రైతు భరోసా రాని వారు ఆర్‌బీకేల్లో సంప్రదించాలన్నారు. వర్షాల నేపథ్యంలో రైతులు చేలలో నీటిని దిగువకు మళ్లించాలన్నారు.

మనస్తాపంతో భర్త ఆత్మహత్య

సాక్షి, భీమవరం: భార్య మరొకరితో చనువుగా ఉంటున్నట్టు తెలిసిన మనస్తాపంతో భర్త ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన భీమవరం పట్టణంలోని శ్రీరామపురంలో చోటుచేసుకుంది. టుటౌన్ ఎస్సై పి.అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరామపురంలోని అపార్ట్‌మెంట్‌లో గుండా శ్రీనివాస్ (43) భార్య, ఇద్దరు పిల్లలతో నివాసముంటున్నాడు. ఆటో నడుపుతూ జీవనం సాగించే శ్రీనివాస్‌కు తన భార్య వేరొకరితో చనువుగా ఉండడంతో ఇద్దరి మధ్యా విభేదాలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో ఈనెల 18వ తేదీ రాత్రి శ్రీనివాస్ తన కుమారుడితో కలిసి ఒక గదిలో పడుకున్నాడు. అర్ధరాత్రి సమయంలో కుమారుడ్ని లేపి తన అమ్మ వద్ద పడుకో అంటూ పంపించాడు. బుధవారం ఉదయం శ్రీనివాస్ గదిలో నుంచి బయటకు రాకపోవడంతో తలుపులు బద్దలుకొట్టి చూడగా ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని మృతిచెందాడు. శ్రీనివాస్ తల్లి సూర్యావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి పంపించామన్నారు.

దంపతుల ఆత్మహత్య


వెంకట కృష్ణప్రసాద్, రాజరాజేశ్వరి (ఫైల్)

పీఎం పాలెం: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో భార్యాభర్తలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆర్థిక సమస్యలే కారణంగానే వీరు బలవన్మరణానికి పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. పీఎంపాలెం సీఐ వై.రామకృష్ణ, మృతుల బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరుకు చెందిన ముద్రగళ్ల వెంకట కృష్ణప్రసాద్ (54), అతని భార్య రాజరాజేశ్వరి (50) చాలాకాలం క్రితం విశాఖ నగరానికి వలస వచ్చారు. వారికి సంతానం లేదు. కృష్ణప్రసాద్ ప్రస్తుతం ప్యూరీపై వాటర్ సరఫరా వ్యాపారం చేస్తున్నాడు. ఇటీవల కొమ్మాది అయ్యప్పనగర్‌లో అద్దెంటికి మారాడు. వీరితోపాటు ఆయన అక్క ఉంటోంది. ఇదిలా ఉండగా వెంకట కృష్ణప్రసాద్ దంపతులు ఎప్పటిలాగే మంగళవారం రాత్రి తమ గదిలో పడుకున్నారు. బుధవారం ఉదయం వారు ఎంతకీ నిద్ర లేవకపోవడంతో కృష్ణప్రసాద్ అక్క తలుపులు కొట్టింది. అయినా తీయకపోవడంతో రాజమండ్రిలో ఉంటున్న బంధువులకు ఫోన్ చేసింది. వారు ప్రసాద్ వద్ద పనిచేస్తున్న సుమన్ అనే వ్యక్తికి ఫోన్ చేయగా అతడు వచ్చి గది తలుపులు తెరిచి చూడగా మంచంపై విగతజీవులుగా పడి ఉన్నారు. వెంటనే అతడు పోలీసులకు సమాచారం అందించాడు.

ఆర్థిక సమస్యలే కారణమా?

దంపతులు ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు పోలీసులు పరిశీలించగా అనేక విషయాలు వెలుగుచేశాయి. నర్సీపట్నంకు చెదిన సుధాకర్ అనే వ్యక్తి స్మార్ట్ విలేజ్ డెవలప్‌మెంట్‌లో ఉద్యోగాలు వేయిస్తానని ఉత్తరాంధ్రకు చెందిన వందలాది నిరుద్యోగుల నుంచి రూ.2 నుంచి రూ.3 లక్షల వరకూ వసూలు చేశాడు. కృష్ణప్రసాద్, రాజరాజేశ్వరి ఈ సంస్థలో పనిచేశారు. ఆ సమయంలో ఈ దంపతులను నమ్మి పలువురు డబ్బులు చెల్లించారు. తరువాత సుధాకర్ పత్తాలేకుండా పోయాడు. తాము ఇచ్చిన సొమ్ము చెల్లించాలని ప్రసాద్‌పై నిరుద్యోగులు ఒత్తిడి తెచ్చారు. ఈ విషయమై రణస్థలం పోలీస్ స్టేషన్‌లో బైండోవర్ కేసు నమోదై ఉంది. తన ప్లాట్లు, ఇళ్లస్థలాలు, వాటర్ ప్లాంట్ తదితర ఆస్తులు అమ్మి 100 మందికి పైగా నిరుద్యోగులకు వారు ఇచ్చిన సొమ్ము చెల్లించాడు. మరికొంతమందికి వచ్చే నెలలో చెల్లించేందుకు అంగీకరించాడు. ఒప్పందం ప్రకారం సొమ్ము చెల్లించలేని పరిస్థితి, తీవ్ర మానసిక ఒత్తిడితో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. అతని డైరీ స్వాధీనం చేసుకున్నామని, దీని ఆధారంగా మరింత లోతుగా దర్యాప్తు చేస్తామన్నారు. మృతదేహాలను కేజీహెచ్‌కు తరలించారు. మృతుని మేనల్లుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు

జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ


కోపల్లె హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ. చిత్రంలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్


కాళ్ల: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ పాఠశాలలన్నీ కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతున్నారని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. కాళ్ల మండలంలో బుధవారం ఆమె పర్యటించారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజుతో కలిసి ఆమె కోపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌ని సందర్శించారు. మధ్యాహ్న భోజనం ఎలా ఉంది, ఉపాధ్యాయులు చదువు ఎలా చెబుతున్నారని, సమస్యలు ఏమైనా ఉన్నాయా అని విద్యార్థుల్ని అడిగి తెలుసుకున్నారు. అదనపు తరగతి గదుల నిర్మాణం, టాయిలెట్స్ మెయింటెనెన్స్ పరిశీలించారు. ఆమె మధ్యాహ్నం భోజనం తిని రుచి చూశారు. శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాన్ని పరిశీలించారు. తొలుత పెదఅమీరం గ్రామంలో ఉన్న పార్టీ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో జెడ్పీటీసీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పునర్నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇప్పటికే నాడు - నేడు పథకంలో సుమారు రూ.60 లక్షలతో ప్రహరీ, అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నట్టు చెప్పారు. మధ్యాహ్న భోజనం పథకం నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహారాజు మాట్లాడుతూ కోపల్లె హైస్కూల్ పునర్నిర్మాణానికి జెడ్పీ చైర్మన్ సహకరిస్తాననడం, పాఠశాల అభివృద్ధికి పూర్వవిద్యార్థులు పూనుకోవడం శుభ పరిణామమని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, వేగేశ్న వెంకటరాజు, రణస్థుల మహంకాళి, ఎంపీపీ పెన్మెత్స విశ్వనాథరాజు, పార్టీ మండల అధ్యక్షుడు గణేశ్న రాంబాబు, కలవపూడి సొసైటీ అధ్యక్షుడు పెన్మెత్స ప్రసాదరాజు, గోళ్ల వెంకట సత్యనారాయణ, సాగిరాజు హరివర్మ, వీరమల్లు బోసు, మంతెన రామ్ కుమార్‌రాజు, కొత్తపల్లి బంగారాజు, దంతులూరి కోటేశ్వరరాజు, వీరమల్లు గంగయ్య, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

సొంతబిడ్డ కన్నా మిన్నగా చూసుకోవాలి


చిన్నారిని దత్తత తల్లిదండ్రులకు అప్పగిస్తున్న కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): దత్తత తీసుకున్న చిన్నారిని సొంతబిడ్డ కన్నా మిన్నగా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ సూచించారు. ఏలూరు కలెక్టరేట్‌లో కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ సమక్షంలో మహిళా శిశు సంక్షేమ అధికారులు బేబి విష్ణబాల అనే 7 నెలల పాపను తమిళనాడుకు చెందిన లింగదొరై, జయంతిలకు దత్తత ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ మాట్లాడుతూ దత్తత అర్జీదారులు 2019వ సంవత్సరంలో బాలిక శిశువు కోసం దరఖాస్తు పెట్టుకొన్నారని, వారికి బేబి విష్ణబాలను దత్తత ఇచ్చామని చెప్పారు. లింగదొరై టీవీ సర్వీసింగ్ సెంటర్ నిర్వహిస్తుండగా జయంతి హోటల్ బిజినెస్ చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ, సాధికారితాధికారి కె.పద్మావతి, డీసీపీఓ సీహెచ్ సూర్య చక్రవేణి, బాలల రక్షణాధికారి ఆర్.రాజేష్, అవుట్ రీచ్ వర్కర్ కె.భార్గవి పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాల వాహనాలు సీజ్



పెదపాడు : కోళ్ల వ్యర్థాలను అక్రమంగా తరలిస్తున్న రెండు వాహనాలను పెదపాడు పోలీసులు బుధవారం సీజ్ చేశారు. పెదపాడు మండలంలోని రాజుపేట వైపు నుంచి పెదపాడు వైపునకు, నాయుడుగూడెం వైపు నుంచి గుడిపాడు వైపునకు కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్నట్టు సమాచారం రావడంతో రెండు వాహనాలను అడ్డుకున్నామని చెప్పారు. ఆరుగురిపై కేసు నమోదు చేశామని ఎస్సై కృష్ణ చల్లా తెలిపారు.

విద్యార్థులకు స్వల్ప గాయాలు



పోలవరం రూరల్ : పోలవరం మండలం బోడిగూడెం గ్రామంలోని గిరిజన సంక్షేమ బాలిక వసతి గృహంలో బుధవారం ఉదయం రేకుల షెడ్డుకు అమర్చిన పీవోపీ సీలింగ్ ఊడి కిందపడింది. ఆ సమయంలో అక్కడ ఉన్న 9వ తరగతి చదువుతున్న గుంజవరపు నిహారిక, కంగాల భావన అనే విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని వార్డెన్ భూక్యా నాంచారమ్మ, హెచ్ఎం సరియం భద్రమ్మ వింజరం పీహెచ్‌సీకి తీసుకువచ్చి చికిత్స చేయించారు. ఘటన తెలిసిన వెంటనే అధికారులు వసతిగృహానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు.

తాడువాయి శివారులో మృతదేహం లభ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి శివారులో రహదారి పక్కన పొదల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని బుధవారం లభ్యమైంది. స్థానికులు సమాచారం మేరకు సీఐ రాజేష్, ఎస్సై సాగర్‌బాబు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం కుళ్లిపోవడంతో నాలుగు రోజుల క్రితమే మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కుటుంబ కలహాలతో పాస్టర్ ఆత్మహత్య!


మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు, పవన్‌కుమార్ (ఫైల్)

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో ఒక పాస్టర్ ఉరి వేసుకుని మృతిచెందారు. 'నా చావుకు నా భార్యే కారణం, కుటుంబ కలహాల నేపథ్యంలో చనిపోతున్నట్టు పాస్టర్ తన సూసైట్ నోట్‌లో పేర్కొన్నట్టు పోలీసులు చెబుతున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. ఏలూరు సత్రంపాడుకు చెందిన పిల్లి పవన్‌కుమార్ (40) పాస్టర్‌గా చాలాకాలంగా ఏలూరులో పనిచేస్తున్నారు. ఆయన ఏలూరు ఆర్ఆర్‌పేటలో నివాసముంటూ అక్కడే హెవెన్ టీవీ చానల్ నడుపుతున్నారు. పవన్‌కుమార్‌కు భార్య స్వప్న, ఇంటర్ చదివే కుమారుడు ఉన్నాడు. పవన్ కుమార్ కు, తన భార్యకు మధ్య విభేదాలు రావటంతో వారిద్దరూ రెండేళ్లుగా దూరంగా ఉంటున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో పెద్దలు పంచాయతీ పెట్టి సఖ్యత కుదిర్చినా పరిస్థితి చక్కబడలేదు. హైదరాబాదులో ఉంటున్న భార్య స్వప్న నెలక్రితం ఏలూరు వచ్చి వెళ్లినట్టు చెబుతున్నారు. ఈనెల 18న మరోసారి ఏలూరు వచ్చిన స్వప్న భర్తతో మాట్లాడి ఏలూరు సత్రంపాడులోని తన పుట్టింటికెళ్లింది. ఈ నేపథ్యంలో పవన్‌కుమార్ ఏలూరు ఆర్ఆర్‌పేటలోని తన ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆయన కుమారుడు ఇంటివద్దకు వచ్చి ఎంత పిలిచినా తలుపులు తీయకపోవటంతో స్థానికులతో కలిసి పోలీసులకు సమాచారం అందించారు. టూటౌన్ పోలీసులు ఘటనాస్థలికి వచ్చి కుటుంబ సభ్యుల సమక్షంలో తలుపులు తీయించారు. పవన్‌కుమార్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. మృతదేహాన్ని ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించారు. టూటౌన్ సీఐ పి.చంద్రశేఖర్ ఆదేశాలతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పెంటపాడు: ప్రత్తిపాడులో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పెంటపాడు ఏఎస్సై ఉమామహేశ్వరి తెలిపిన వివరాల ప్రకారం.. జువ్వలపాలెం గ్రామానికి చెందిన మంగిన శ్యాం శేఖర్ సూర్యనారాయణ (25) తాపీ పని నిమిత్తం స్నేహితుడు అనిల్‌తో కలిసి మంగళవారం రాజమండ్రి వెళ్లాడు. తిరిగి రాత్రి ఇద్దరూ కలిసి స్వగ్రామానికి మోటార్ సైకిల్‌పై వస్తుండగా ప్రత్తిపాడు గ్రామంలోని కోదండ రామాలయం వద్ద గుర్తుతెలియని వాహనాన్ని వెనకనుంచి ఢీకొట్టారు. ఈ ఘటనలో సూర్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందగా, స్నేహితుడు అనిల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతనిని 108 వాహనంలో గూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. సూర్యనారాయణ సోదరుడు సాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఎస్సై జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఏఎస్సై తెలిపారు.

వస్త్ర దుకాణంలో చోరీ

ఏలూరు టౌన్: ఏలూరు కర్రలవంతెన సమీపంలోని రామరాజ్‌కాటన్ షోరూమ్‌లో చోరీ జరిగింది. షోరూమ్ మేనేజర్ విక్రమ్ వర్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ సీఐ పీ.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. మంగళవారం రాత్రి వ్యాపారం ముగించి రామరాజ్ కాటన్ షోరూమ్‌ను యథావిధిగా ముగించి, తాళాలు వేసి వెళ్లారు. బుధవారం ఉదయం షోరూమ్ వద్దకు వచ్చే సరికి షట్టర్ తాళాలు తొలగించి, దొంగలులోనికి వెళ్లి నగదు పెట్టెలో ఉన్న రూ.51 వేలు అపహరించుకుపోయారని పేర్కొన్నారు.

ఆలయంలో చోరీపై కేసు

జంగారెడ్డిగూడెం: అమ్మవారి ఆలయంలో చోరీపై పురోహితుడు రంగాల పైడిరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్టు హెచ్‌సీ పీసీహెచ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. జంగారెడ్డిగూడెం రాజీవ్‌నగర్‌లో ఉన్న పైడితల్లి అమ్మవారి ఆలయంలో ఈ నెల 18వ తేదీ సాయంత్రం చోరీ జరిగిందన్నారు. ఆలయం తలుపుల తాళం పగులకొట్టి ఉండటంతో పాటు పైడితల్లి అమ్మవారి మెడలోని ఒక కాసు బంగారు సూత్రాలు, ఐరన్ హుండీ చోరీకి గురయ్యాయని, ఐరన్ హుండీలో రూ.15 వేల వరకు నగదు ఉండొచ్చని ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు.

వలంటీర్ వ్యవస్థపై దాడి సిగ్గుచేటు


వేల్పూరులో మాట్లాడుతున్న చీకట్లమిల్లి మంగరాజు

తణుకు టౌన్: రాష్ట్రంలో అమలవుతోన్న సంక్షేమ పథకాలు, వలంటీర్ వ్యవస్థ పట్ల వివిధ రాష్ట్రాలు ఆసక్తి కనబరుస్తుంటే ప్రతిపక్ష నాయకులు దాడి చేయడం సిగ్గు చేటని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు పేర్కొన్నారు. బుధవారం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంతో నూతన అధ్యాయాన్ని సృష్టించారని గుర్తుచేశారు. తండ్రికి తగ్గ తనయుడుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ వార్డు, సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలందించిన వలంటీర్లను ప్రతిపక్షాలు సంఘవిద్రోహ శక్తులుగా పేర్కొనడం దారుణమన్నారు. 2019 ఎన్నికలకు ముందు రాష్ట్రంలో మహిళా, రైతు రుణాలు రూ.14, 200 కోట్లు చంద్రబాబు నాయుడు ఇవ్వకుండా పోతే.. ఆ రుణాల నిమిత్తం రూ.27 వేల కోట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడతల వారీగా చెల్లిస్తున్నారని వివరించారు. సమావేశంలో నాయకులు వి.సునీల్, కె.రత్నాకర్, బి.సందీప్, ఎం.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సగంచెరువు యువకుడు దుర్మరణం


లారీని ఢీకొన్న వ్యాను


బొక్కా లక్ష్మీనారాయణ (ఫైల్)

పాలకొల్లు అర్బన్/యలమంచిలి: వ్యాన్ డ్రైవర్ నిద్రమత్తు అతని ప్రాణం తీసింది. విశాఖ జిల్లా యలమంచిలి మండలం కొక్కిరాపల్లి హైవే వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలకొల్లు మండలం సగం చెరువు గ్రామానికి చెందిన బొక్కా లక్ష్మీనారాయణ అలియాస్ రాజు (28) దుర్మరణం చెందాడు. యలమంచిలి రూరల్ ఎస్సై కె.సన్నిబాబు తెలిపిన వివరాల ప్రకారం. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం నుంచి రొయ్యల లోడుతో బయలుదేరిన వ్యాన్ విశాఖపట్నం జిల్లా గాజువాకకు వెళుతుండగా జాతీయ రహదారిపై కొక్కిరాపల్లి సమీపంలో బుధవారం తెల్లవారుజామున ముందు వెళుతున్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ లక్ష్మీనారాయణ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. వ్యాన్ డ్రైవర్ నిద్రమత్తు వల్లే ఈ ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు. లక్ష్మీనారాయణ చిన్నతనంలో తండ్రిని కోల్పోయారు. తల్లి జయభారతి ఇద్దరు కుమారులు, కుమార్తెను పెంచి పోషించింది. కుమారుడు, కుమార్తెకు వివాహం కాగా, లక్ష్మీనారాయణకు ఇంకా వివాహం కాలేదు. కుమారుడి మరణ వార్త తెలియడంతో గ్రామంలో తల్లి జయభారతి బోరున విలపిస్తోంది. ఆమెను బంధువులు, స్నేహితులు ఓదార్చారు. వీరిలో గ్రామ సర్పంచ్ కడలి నాగమణి, గ్రామ పెద్దలు ఉన్నారు. గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

వివాహిత అదృశ్యం

సాక్షి, భీమవరం: రాయలం ప్రాంతానికి చెందిన ఎం.హావీని ఈ నెల 18వ తేదీ నుంచి కనిపించడంలేదని ఆమె తల్లి సీహెచ్ పార్వతి ఫిర్యాదు చేసినట్లు టూటౌన్ పోలీసులు బుధవారం తెలిపారు. ఉంగుటూరు మండలం రావులపర్రుకు చెందిన హావీని అదే ప్రాంతానికి చెందిన వ్యక్తిని తొమ్మిది నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకుందన్నారు. జీవనోపాధి నిమిత్తం రాయలం వచ్చి ఉంటున్నారని, మంగళవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఏఎస్సై పి.సూర్యనారాయణ తెలిపారు.

క్లుప్తంగా

విద్యార్థినులకు దుస్తుల పంపిణీ



విద్యార్థినులకు దుస్తులు పంపిణీ చేస్తున్న అమ్మ నాన్న సేవా సంస్థ సభ్యులు, తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో అమ్మ నాన్న సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం యాగర్లపల్లిలోని ప్రభుత్వ సాంఘీక సంక్షేమ బాలికల వసతి గృహంలోని విద్యార్థినులకు దుస్తులు పంపిణీ చేశారు. అధ్యక్షుడు వడ్రే కోటేశ్వరరావు మాట్లాడుతూ చక్కని చదువులు చదవాలని, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని, ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని ఆకాంక్షించారు. వడ్రే సర్వేష్, బీవీఎస్‌బీఆర్ రాజు, సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



సమావేశంలో పాల్గొన్న రజక సంఘం నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే వరకు పోరాటం ఆగదని రాష్ట్ర రజక వృత్తిదారుల సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు అడ్డాల నరసింహారావు, రజకజన సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యండమూరి మహేష్‌లు అన్నారు. పట్టణంలో బుధవారం సంఘ సభ్యులు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ ఆగస్టు నెలలో ఛలో ఢిల్లీ కార్యక్రమం జంతర్ మంతర్ వద్ద జరుగుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి వినిపించే విధంగా రజకులను ఎస్సీ జాబితా లో చేర్చాలని డిమాండ్‌చేస్తూ 24గంటలపాటు నిరాహార దీక్ష చేస్తామన్నారు. అనేక రాష్ట్రాల్లో రజకులు ఎస్సీ జాబితాలో ఉన్న విషయాన్ని ప్రస్తావించారు. పసుపులేటి శ్రీనివాస్, బైనపాలపు జగదీష్, అడ్డాల సత్యనారాయణ, అంజూరి శ్రీనివాస్, కె.గోవర్ధన్ రాము, కృష్ణ, వెంకటేశ్వరరావు, రజక నాయకులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన



గూడెం బార్ అసోసియేషన్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అవనిగడ్డలో న్యాయవాదిపై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని తాడేపల్లిగూడెం న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొవ్వూరి అప్పిరెడ్డి డిమాండ్ చేశారు. న్యాయవాదిపై దాడిని ఖండిస్తు బుధవారం న్యాయవాదులు ఆధ్వర్యంలో అసోసియేషన్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ కక్షిదారులు న్యాయవాదులపై కక్షలు పెంచుకోవడం సరికాదని హితవు పలికారు. దాడులు, హత్యలు పెరుగుతున్నందున న్యాయవాదుల రక్షణ కోసం సమగ్ర చట్టం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ దాసం సునీల్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ తోట మురళీకృష్ణ, ఆర్ఎస్‌వీ సోమేశ్వర రావు, వి.లక్ష్మీనారాయణ, హరిప్రియ, యలమంచిలి ప్రియాంక, ఝాన్సీరాణి, సౌదామిని, కె.శివరామకృష్ణ, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

పల్లెకొచ్చి.. పరీక్షలు చేసి..

- గ్రామీణులకు చేరువైన వైద్యపరీక్షలు
- సత్ఫలితాలు ఇస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానం



ఇంటింటికీ వైద్యపరీక్షల్లో భాగంగా వృద్ధుని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న డాక్టర్, సిబ్బంది

పెంటపాడు: ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. దీని ద్వారా ప్రతీ గ్రామంలోనూ మారుమూల పల్లెల్లో ప్రజలకు నిరంతరాయంగా వైద్యసేవలు అందుతున్నాయి. నెలలో రెండు పర్యాయాలు 104 వాహనంతో పాటు, పీహెచ్‌సీ వైద్యసిబ్బంది గ్రామాల్లోకి వచ్చి దీర్ఘకాలిక, కదలలేని రోగులను గుర్తించి ఇంటింటికి వెళ్లి వైద్యపరీక్షలు చేస్తున్నారు. ఉచితంగా మందులు అందిస్తున్నారు. గతంలో పీహెచ్‌సీ, లేదా సీహెచ్‌సీలకు వెళ్లి ప్రజలు పరీక్షలు చేయించుకొనేవారు. దీనివల్ల ప్రజలకు తీవ్ర వేదనగా ఉండేది. దానివల్ల చిన్నపాటి ఆనారోగ్యాన్ని డాక్టర్‌కు చూపించుకొనేందుకు ఆసక్తి చూపేవారు కాదు. కరోనా అనంతరం సీఎం వైఎస్ జగనన్న చేపట్టిన ఈ ఏర్పాటు వల్ల ప్రజలకు ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. ఇంటివద్ద ఉన్న రోగులకు ఇంటి వద్దే నాణ్యమైన సేవలు అందుతున్నాయి. దీంతో ఎంతో ఖర్చుకూడా రోగులకు తగ్గింది. మండలంలో రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. 21 గ్రామాల్లోని ప్రజలకు ఈ ఫ్యామిలీ విధానం వల్ల 14 రకాలు వైద్యసేవలు అందుతున్నాయి. దీర్ఘకాలిక రోగులకు ఇంటివద్ద ఫ్యామిలీ డాక్టర్ ద్వారా మంచానికి పరిమితమైన రోగులు, వికలాంగులు, ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం చేయించుకొనే రోగులను ఇంటివద్దకే వెళ్లి పరీక్షలు చేస్తున్నారు. 14 రకాల వైద్యపరీక్షలతో పాటు, ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కూడా వైద్యసేవలు అందిస్తున్నారు. 104 వాహనాలు రెండు ఉన్నాయి. పీహెచ్‌సీకి ఇద్దరు చొప్పున వైద్యులు, 8 మంది సిబ్బంది ఉన్నారు. రోజుకు సగటున 245 మంది చొప్పున రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారు. 67 రకాల కొత్త మందులు వైద్య విధానంలో భాగంగా ఇంటివద్దకే పరీక్షలు నిర్వహిస్తున్నారు.

104 వాహనంలో మెడికల్ లాబ్, 14 రకాల పరీక్షలు చేస్తున్నారు. ఆరోగ్యపరిస్థితి ఆధారంగా వైద్యులు సూచనల మేరకు రక్త పరీక్షలు చేపడుతున్నారు. సమస్యలను గుర్తించి బాధితులకు అప్పటికప్పుడు మందులు పంపిణీ చేస్తారు. వాహనంలో 67 రకాల మందులు సిద్ధం చేశారు.

అందుబాటులో వైద్యం



మా ప్రాంతంలో నెలకు రెండు సార్లు 104 వాహనంవస్తుంది. బీపీతోపాటు, ఇతరపరీక్షలు చేసి మందులు అందిస్తున్నారు. అంతేకాకుండా సలహాలు సూచనలు ఇస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ పథకం ప్రజలకు ఎంతో మేలు చేస్తోంది. ఫ్యామిలీ డాక్టర్ ద్వారా మెరుగైన సేవలు అందిస్తున్నారు.

– సురగాల ఇశ్రాయేలు, రావిగుంట, ఆకుతీగపాడు

ముందస్తు సమాచారంతో



ఫ్యామిలీ వైద్యవిధానం వల్ల ప్రతీ ఒక్కరికీ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ముందస్తు సమాచారంతో ఏఎన్ఎంలు, ఏఎల్‌హెచ్‌ఈలు, ఆశా కార్యకర్తలు ప్రతీ ఇంటికి వచ్చి ఆరోగ్యంపై ఆరా తీస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ నెలలో ఏ రోజు వస్తున్నారో ముందస్తుగా సమాచారం ఇస్తున్నారు. అదేరోజు మా గ్రామంలోని ప్రజలు అక్కడకువెళ్లి వైద్యసేవలు పొందుతున్నారు.

– దెక్కపాటి వెంకటరమణ, రావిపాడు

వారి సేవలు మరువలేం

వలంటీర్లకు వందనం



పెంటపాడు: నా పేరు తడపల లక్ష్మి, ప్రత్తిపాడు శివారు కాగులంపాడులో నివాసం ఉంటున్నాను. మా వలంటీర్ లక్ష్మి. మాకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయంటే దానికి కారణం ఆమె. మాకు ప్రభుత్వ పథకాలు ఎలా వస్తాయో తెలియదు. మా కుటుంబంలో ఆసరా, చేయూత, ఆరోగ్య శ్రీ, పిల్లలకు విద్యాకానుక, క్రాఫ్ ఇన్సూరెన్స్ ఇలాంటి పథకాలు మా వలంటీర్ ద్వారా అందాయి. ప్రభుత్వ పథకాలకు ఎలా దరఖాస్తు చేయాలో తెలియదు. మా వలంటీర్ పుణ్యమా అని నేడు అన్ని ప్రభుత్వ పథకాలు తీసుకోగలుగుతున్నాం. కరోనా సమయంలోకూడా మా ఇంటికివచ్చి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆప్యాయంగా పలకరించేది. మా వలంటీర్ సేవలు మరువలేం.

– తడపల లక్ష్మి, ప్రత్తిపాడు శివారు కాగులంపాడు

కుటుంబ సభ్యురాలిలా..



నా పేరు కొండపల్లి శేషారత్నం, రామాలయం వీధి, ప్రత్తిపాడులో నివసిస్తున్నాను. లక్ష్మి మా గ్రామంలో వలంటీర్ సేవలందిస్తుంది. గత నాలుగేళ్లుగా జగన్ ప్రభుత్వం అమలు చేసిన ఎన్నో సంక్షేమపథకాలు లబ్ధిదారుల దరిచేర్చింది. మా కుటుంబంలో ఏ పని కావాలన్నా చేసిపెడుతుంది. గతంలో కరోనా సమయంలోనూ ఇంటింటికివెళ్లి పింఛన్ పంపిణీచేసి వృద్ధుల దీవెనలు అందుకున్నది. అంతేకాకుండా నడవలేని వృద్ధులకు ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యసేవలు చేయించి, అవసరమైన వైద్యం చేయించేది. ప్రభుత్వం అందించే పథకం మాకు చేరేందుకు వలంటీర్లు ఎంతగానో సాయపడుతున్నారు. జగనన్న చల్లగాఉండాలి.

– కొండపల్లి శేషారత్నం, రామాలయం వీధి, ప్రత్తిపాడు

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- యువనేత కారుమూరి సునీల్‌కుమార్
- బల్లిపాడులో గడపగడపకు మన ప్రభుత్వం



అత్తిలి మండలం బల్లిపాడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న యువనేత కారుమూరి సునీల్‌కుమార్

అత్తిలి: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను గడపవద్దకే అందజేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఆదరించాలని యువనేత కారుమూరి సునీల్‌కుమార్ అన్నారు. అత్తిలి మండలం బల్లిపాడు గ్రామంలో బుధవారం సాయంత్రం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో కారుమూరి సునీల్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. లబ్ధిదారులు పథకాల కోసం నాయకుల చుట్టూ తిరిగే పనిలేకుండా అర్హతే ప్రామాణికంగా అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల జీవనప్రమాణాలు పెంపొందుతున్నాయని చెప్పారు. ఈసందర్భంగా సునీల్‌కుమార్ ఇంటింటికి వెళ్లి వారికి నాలుగేళ్ల కాలంలో ఆకుటుంబానికి కలిగిన లబ్ధిని వివరిస్తూ కరపత్రాలను అందజేసారు. మహిళలను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ఇంకా ఎవరైనా అర్హులై ఉండి పథకాలు రానివారు ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్ధరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, సర్పంచ్ కసిరెడ్డి బాలాజీ, మాజీ సర్పంచ్‌లు ఆకుల పండుస్వామి, ధనుమూరి వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ తలారి శ్రీనివాస్, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, ట్రస్టుబోర్డు చైర్మన్ ధనుమూరి తాతాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి అమ్మిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రంభ సూరిబాబు, శింగంశెట్టి శ్రీనివాస్, తోట వెంకటేశులు, ఆంజనేయులు, రాయుడు ధర్మారావు, రామారావు, కంకటాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై అవగాహన అవసరం

తణుకు టౌన్: ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా అప్రమత్తంగా ఉండాలని తణుకు నియోజకవర్గ ప్రత్యేక అధికారి జెడ్ వెంకటేశ్వరరావు కోరారు. ఓటరు జాబితా సవరణకు సంబంధించి బుధవారం సాయంత్రం తణుకు తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవిల్ ఆఫీసర్లకు నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే సంవత్సరం జరిగే సార్వత్రిక ఎన్నికలకు సిబ్బంది ఇప్పటి నుంచే సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమానికి సంబంధించి బూత్ స్థాయి అధికారులు ఇంటికి వచ్చినప్పుడు ప్రజలు కూడా సహకరించి, ఓటర్లు సమాచారం అందించాలని కోరారు. తప్పులు లేని ఓటరు జాబితా తయారీకి ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎన్నికల డిటీ సూర్యనారాయణరాజు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

తణుకు అర్బన్: తణుకు పురపాలక సంఘం కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న పైపులైన్‌ల మరమ్మతుల కారణంగా గురువారం సాయంత్రం తాత్కాలికంగా తాగునీటిని నిలుపుదల చేస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ కేటీ సుధాకర్ తెలిపారు. మరమ్మతుల అనంతరం తిరిగి 21వ తేదీ ఉదయం నుంచి యధావిధిగా తాగునీరు సరఫరా చేస్తామన్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్చాలి



అత్తిలిలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల నమోదు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో రమేష్

అత్తిలి: బడిఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలని ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు అన్నారు. బడిబయట ఉన్న దివ్యాంగుల పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు కార్యక్రమం బుధవారం అత్తిలిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ బడి బయట ఉన్న దివ్యాంగుల పిల్లలను గుర్తించి, పాఠశాలల్లో చేర్పించి, చైల్డ్‌ఇన్ఫోలో నమోదు చేయాలన్నారు. మండల విద్యాశాఖాధికారి ఎన్ రమేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ ప్రత్యేక యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసి, ప్రత్యేక అవసరాలుగల పిల్లలను నమోదు చేయాలన్నారు. ఈ ప్రక్రియకు సీఆర్పీలు, పీటీఐలు, వలంటీర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, ఐఈఆర్టీల సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఐఈడీఎస్ కృష్ణమావుళ్లు, సహిత ఉపాధ్యాయులు కె రమ్య, జుత్తిగ ఏడుకొండలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టుకు సంబంధించి అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకురాలి పోస్టులకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి టి.లక్ష్మీసరస్వతి తెలిపారు. తాడేపల్లిగూడెం అర్బన్ నుంచి ఏడు పోస్టులకు గాను 18, 10, 6-1, 6-2, 31, 7, 16 వార్డుల పరిధిలో ఏడు పోస్టులకు పీహెచ్, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్, ఓసీ, ఎస్సీ, ఈడబ్ల్యూఎస్, బీసీ(డీ), రూరల్ మండలం కొమ్ముగూడెం బీసీ(సీ), పెంటపాడు మండలం దర్శిపర్రు ఓసీలకు రిజర్వు కాబడినట్లు వెల్లడించారు. పదో తరగతి పాసై, స్థానిక వివాహిత మహిళలు మాత్రమే అర్హులుగా పేర్కొన్నారు. సంబంధిత ధ్రువపత్రాలు ప్రభుత్వాధికారి అటెస్టెడ్ చేసి, ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు పెంటపాడు మండలం, ప్రత్తిపాడు గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

నేడు పెంటపాడులో 'గడపగడపకు' కార్యక్రమం

పెంటపాడు: మండలంలో గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం గురువారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్లు పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొనే ఈ సమావేశం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

భవిత కేంద్రంలో దివ్యాంగులకు ఫిజియోథెరపీ



దివ్యాంగులకు ఫిజియోథెరపీ నిర్వహిస్తున్న డా. శ్రీకృష్ణ మహేష్

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగుల పిల్లల లోపాలను అధిగమించేందుకు ఫిజియోథెరపీ ఎంతో అవసరమని డాక్టర్ అల్లు శ్రీకృష్ణ మహేష్ అన్నారు. భవిత దివ్యాంగుల సెంటర్‌లో బుధవారం దివ్యాంగుల పిల్లల నిమిత్తం ఫిజియోథెరపీ శిబిరం జరిగింది. ఈ సందర్భంగా శ్రీకృష్ణ మహేష్ మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లలకు ఇంటి వద్ద ప్రతి రోజు క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ నిర్వహించనట్లు అయితే పిల్లల లోపాన్ని అధిగమించి, తమ పనులు తాము చేసుకోగల్గుతారని తెలిపారు. భవితా కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాల ఈశ్వరయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అందించే అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుకతో పాటు సమగ్ర శిక్ష ద్వారా దివ్యాంగుల పిల్లలకు అవసరమైన ఉచితంగా ఉపకరణాలు, వివిధ రకాల అలవెన్స్‌లు, బోధనసామాగ్రి అందజేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు, వారి తల్లిదండ్రులు హాజరైయారు.

బ్యాంకులను పరిరక్షించేందుకు పోరాటాలు చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న సమాఖ్య జోనల్ కార్యదర్శి జవహర్‌లాల్

తాడేపల్లిగూడెం (టీఓసీ): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం బ్యాంకులను ప్రైవేటీకరణ చేసేందుకు చూస్తోందని, బ్యాంకులను పరిరక్షించేందుకు పోరాటాలను మరింత ఉధృతం చేయాలని బ్యాంకు యూనియన్ నాయకులు తెలిపారు. గూడెంలో పట్టణంలో బ్యాంకుల జాతీయకరణ 55వ వార్షికరోత్సవ సభను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ, తెలంగాణ బ్యాంక్ ఉద్యోగుల సమాఖ్య కార్యదర్శి టి.సూర్యనారాయణ, ఎస్‌బీఐ అధికారుల సమాఖ్య జోనల్ కార్యదర్శి జవహర్‌లాల్, బ్యాంక్ ఆఫ్ ఇండియా ఛీఫ్ మేనేజర్ ఎన్.ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ ప్రజల కోసం, దేశాభివృద్ధి కోసం నాడు మాజీ ప్రధాని ఇందిరా గాంధీ బ్యాంకులను జాతీయకరణ చేశారని, నాడు ఆర్థికాభివృద్ధికి బ్యాంకులు దోహదపడ్డాయని తెలిపారు. నేడు కేంద్రంలోని ప్రభుత్వం కారణంగా ప్రజలు దాచుకొన్న సొమ్ములను కాపాడేందుకు యూనియన్‌లు కష్టపడాల్సి వస్తుందన్నారు. మరిన్ని ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఏపీ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ సీనియర్ నాయకులు ఎస్.సూర్యనారాయణ, ఎస్‌బీఐ ఉద్యోగాల సంఘం నాయకులు ప్రభాకర్, సీనియర్ నాయకులు ఎస్.ఎస్.ప్రసాద్‌లు వివిధ బ్యాంకుల ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

సాక్షి, భీమవరం: ఉన్నత విద్యనభ్యసించే పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడంలో దాతలు అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని భీమవరం ఆర్డీఓ దాసి రాజు అన్నారు. భీమవరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన ఆరుగురు విద్యార్థులకు శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో బుధవారం ఆర్థికసహాయం అందించారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన ఎ.నందిని, కె.కీర్తిశ్రీరంగ శివాని, టి.మేఘన, కె.కృష్ణప్రియ, వి.రమాదేవి, కళ్యాణిలకు ఒక్కొక్కరికి రూ.3 వేలు అందించారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ తుమ్మలపల్లి మంగరాజు విశ్రాంతి భవన్ ట్రస్ట్ సహకారంతో నగదు పురస్కరాలు అందించినట్లు చెప్పారు.

సాగి రామకృష్ణంరాజు సేవలు స్ఫూర్తిదాయకం

సాక్షి, భీమవరం: సామాజికసేవతో పాటు విద్యారంగం అభివృద్ధికి కృషి చేసిన దివంగత సాగి రామకృష్ణంరాజు నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని రాష్ట్ర శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల, ప్రసాద్ అండ్ కో కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో బుధవారం రామకృష్ణంరాజు 90వ జయంతిని కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మోషేనురాజు మాట్లాడారు. చినఅమిరం వంటి చిన్న గ్రామంలో 43 ఏళ్ల క్రితం ఇంజినీరింగ్ కళాశాల స్థాపించి దేశానికి ఆదర్శవంతమైన విద్యాలయంగా తీర్చిదిద్దడంలో ఆయన కృషి ప్రశంసనీయమన్నారు. ముందుగా రామకృష్ణంరాజు విగ్రహానికి నివాళులర్పించిన మోషేనురాజు దివ్యాంగులకు ట్రై సైకిల్స్ పంపిణీ చేశారు.